అనుమతి లేని కళాశాలపై చర్యలు తీసుకోవాలి

దుండిగల్,సెప్టెంబర్ 25: అనుమతి లేని ఇంటర్ మీడియట్ రెసిడెన్షియల్ కళాశాలపై ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్‌కు చెందిన డి.స్వామి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన నాంపల్లిలోని ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ వెంక్యానాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు పొందకుండానే దుండిగల్‌లోని నిర్మాణంలో ఉన్న ఓ బహుళ అంతస్తుల భవనంలో(2024-25) విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ తరగతులను(ఎంపీసీ) ఓ కళాశాల యాజమాన్యం నిర్వహిస్తుందన్నారు. ఇదే కళాశాలకు చెందిన మొదటి సంవత్సరం విద్యార్థి ఇండక్షన్ డేకు రెండురోజుల ముందు(ఆగస్టు 2వ తేదీన) ఇందులో చదువుతున్న విద్యార్థి ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిపారు. అయినప్పటికీ సదరు కళాశాల నిర్వాహకులపై చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్‌లో ఒక కళాశాల నిర్వహిస్తున్న యజమానులు దుండిగల్‌లోనూ అనుమతులు లేకుండా తరగతులను నిర్వహిస్తున్నారని తెలిపారు. పైగా ఈ భవనం ప్రస్తుతం నిర్మాణములో ఉండటంతోపాటు అనుమతులకు మించి అక్రమ అంతస్తులు నిర్మిస్తున్నట్లు తేలిందన్నారు. నిర్మాణంలో ఉన్న భవనంలో రెసిడెన్షియల్ కళాశాల ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఫలితంగా సుమారు 440 మంది విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై సదరు కళాశాల అనుమతులపై విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇంటర్మీడియట్ తరగతులు నిర్వహిస్తున్న భవనం ఇదే, వెంక్యానాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్వామి

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 25: కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో బుధవారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 43, వంకాయ 35, బెండకాయ 40, పచ్చిమిర్చి 23, బజ్జి మిర్చి 65, కాకరకాయ 38, బీరకాయ 38, క్యాబేజి 21, ఫ్రెంచ్ బీన్స్ 55, క్యారెట్ 45, కాలీఫ్లవర్ 28, దొండ 40, చిక్కుడు 70, గోరుచిక్కుడు 28, బీట్‌రూట్ 28, క్యాప్సికం 65, ఆలుగడ్డ 38, కీరా 25, దోసకాయ 21, సొరకాయ 15, పొట్లకాయ (1) 18, కందగడ్డ 65, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 54, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ 8 నుంచి 10, చామగడ్డ 40, ముల్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 40, గుమ్మడికాయ 40, నిమ్మకాయలు(12) 50 నుంచి 60, మునగకాయ(1) 6 నుంచి 8, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 200, వెల్లుల్లి 380, చింతపండు 140గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

రోడ్లపై ఉన్న చెట్లకొమ్మలను తొలగించండి

అల్లాపూర్, సెప్టెంబర్ 25: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లో కరెంటు తీగలను ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మలను ప్రమాదాలు జరగకుండా విద్యుత్ శాఖ సిబ్బంది కత్తిరించారు. ఇక వర్షాల కారణంగా మర్రి చెట్లు విరిగి రోడ్లపై పడి నెలలు గడుస్తున్నా కొమ్మలను తొలగించకపోవడంతో దారినపోయే వారు చెత్తను పారబోస్తున్నారు. దీంతో దోమలు, ఈగలకు ఆవాస కేంద్రాలుగా మారడంతోపాటు తీవ్రమైన దుర్వాస వెదజల్లుతుందని స్థానికులు వాపోతున్నారు. విద్యుత్ అధికారులు పనులు పూర్తి చేయడంలేదని, కత్తిరించిన కొమ్మలు తరలించక ముందే కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించడంతో నిర్లక్ష్యంగా పని అంతటితో అయిపోయిందని చేతులు దులుపుకుంటున్నారు. ఇక జీహెచ్ఎంసీ కూడా విద్యుత్ సిబ్బంది నరికేసిన చెట్ల కొమ్మలు తొలగించడం తమకు సంబంధం లేదంటూ వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లపై కుప్పలుగా పడివున్న చెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

28, 29తేదీల్లో డీడీఎంఎస్ కోఫేమ్‌లో సంగీత పోటీలు

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 25: ఓయూ క్యాంపస్‌లోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ (డీడీఎంఎస్) కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అండ్ మీడియా ఎడ్యుకేషన్ (కోఫేమ్)లో ఈనెల 28వ తేదీ నుంచి సంగీత పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల చైర్‌పర్సన్ డాక్టర్ వై.రమాప్రభ, ప్రిన్సిపాల్ కె.విజయ ఒక ప్రకటనలో తెలిపారు. 28న సీనియర్, సూపర్ సీనియర్ కేటగిరీలకు, 29న జూనియర్, సబ్ జూనియర్ కేటగిరీలకు కర్ణాటక గాత్ర-వీణ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వారు వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పోటీల రోజే కళాశాలకు వచ్చి సైతం స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని చెప్పారు. ఇతర వివరాలకు 94417 68811, 94413 86157 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్,సెప్టెంబరు25: మేడ్చల్ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో వెల్డర్, డీజిల్‌మెకానిక్, రెండు సంవత్సరాల కోర్సు లైన టర్నర్, ఎలక్ట్రానిక్స్, మెకానిక్‌లలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈనెల 28న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ హనుమాన్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి పాసై, 14 ఏండ్లు పూర్తి అయిన విద్యార్థులు ఈ కోర్సుల్లో చేరడానికి అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు www.iti.telangana.gov.in అనే సైట్ నందు నమోదు చేసుకొని, ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. ఇదే ఐటీఐలో చేరడానికి చివరి అవకాశమని ఆయన పేర్కొన్నారు.

వరద బాధితులకు చేయూత

ఉప్పల్, సెప్టెంబర్ 25: విజయవాడలోని వరద బాధితులకు ఈసీఐఎల్ చౌరస్తాకు చెందిన సోలీస్ కంటి వైద్యశాల, ఆర్ఎస్ స్టీల్ సిండికేట్ ఆధ్వర్యంలో రూ.5లక్షలు విలువ చేసే నూతన దుస్తులను పంపిణీ చేశారు. విజయవాడలోని రాజరాజేశ్వరపేట, అజిత్ సింగ్‌నగర్‌లో సోలీస్ కంటి వైద్యశాల చైర్మన్ నందనంపాటి రామంజనేయులు, ఆర్ఎస్ స్టీల్ సిండికేట్ ఎండీ బాలమురళీకృష్ణ, పోనూర్ రోహిత్‌ల ఆధ్వర్యంలో నూతన దస్తువులతో పాటు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కుంట శ్రీ గొల్లఅంజనేయ స్వామి ట్రస్ట్ ప్రతినిధులు పుల్లారావు, మద్దాల కామేశ్వర్‌రావు, సీతరాంగుప్తా, కిశోర్, పురుషోత్తం, రఘు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా ఉంటాం

మల్కాజిగిరి:వరద బాధితులకు అండగా ఉంటామని తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం నాయకులు అన్నారు. బుధవారం మల్కాజిగిరిలో ఖమ్మం జిల్లా వరద బాధితుల కోసం కళాకారులు విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో అక్షయ్, రాజు, యాకన్న, రమేశ్, ఎండీ సయ్యద్, శ్రీకాంత్, ఉమేశ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు

విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

మాదాపూర్, సెప్టెంబర్ 25: లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ హోప్ ఆధ్వర్యంలో ఉచిత దంత పరీక్షలు నిర్వహించారు. హఫీజ్‌పేట్‌లోని గంగారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ దంత వైద్యుడు, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి హాజరై చిన్నారులకు దంత పరీక్షలు చేశారు. దంతాల శుభ్రంతోపాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి విద్యార్థులకు వివరించాడు. అనంతరం విద్యార్థులకు టూత్‌పేస్ట్, టూత్ బ్రష్‌లను కొండా విజయ్‌కుమార్ చేతులమీదుగా అందజేశాడు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు బసిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, సెక్రటరీ సింగరెడ్డి, శాంతిభూషన్‌రెడ్డి, ట్రెజరర్ రెడ్డి ప్రవీణ్‌రెడ్డి, సభ్యులు మహిపాల్‌రెడ్డి, మారం వెంకట్, మారం ప్రసాద్, దాసరి రాజశేఖర్‌తోపాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సుభాష్, ప్రీతి, కృష్ణవేణి, పద్మలత, స్వప్నతోపాటు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

దుండిగల్, సెప్టెంబర్ 25: దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛత హి సేవా-2024 కార్యక్రమంలో భాగంగా బుధవారం దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలో మున్సిపల్ కమిషనర్ కె.సత్యనారాయణరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, క్విజ్ కాంపిటీషన్ నిర్వహించారు. ముఖ్యంగా స్వచ్ఛత హి సేవ, స్వచ్ఛ తెలంగాణ, స్వచ్ఛ దుండిగల్ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ కవర్ల నిషేధం, వాటి వలన పర్యావరణానికి జరుగుతున్న నష్టం, ఇంటిలోనే తడి, పొడి చెత్త వేరు చేసి తడి చెత్తని కంపోస్టుగా తయారు చేయడం, ఎన్విరాన్మెంట్‌కు హాని జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపైన ఈ పోటీలు నిర్వహించడం జరిగినట్లు కమిషనర్ తెలిపారు. అదేవిధంగా అన్ని వార్డుల్లో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సైతం ఈ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ పీ.సాత్విక్, శానిటరీ ఇన్స్పెక్టర్ రామచందర్, వార్డు ఆఫీసర్స్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో ప్రతిభచాటిన ఎంఎల్ఆర్ఐటీ కళాశాల విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరావు

ఇన్‌కాయిస్‌లో సునామీ ఎస్ఓపీపై వర్క్‌షాప్

వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రతినిధులు

దుండిగల్, సెప్టెంబర్ 25 : నగర శివారు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్ సమీపంలోని సునామీ హెచ్చరికల కేంద్రం భారత జాతీయ మహాసముద్ర సమాచార సేవా కేంద్రం(ఇన్‌కాయిస్)లో సునామీ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్(ఎస్ఓపీ) పేరిట రెండు రోజులపాటు నిర్వహించనున్న వర్క్‌షాప్ బుధవారం ప్రారంభమైంది. హిందూ మహా సముద్ర సునామీ 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ఏడాది నవంబర్ 5వ తేదీన నిర్వహించనున్న జాతీయ సునామీ మాక్ ఎక్సర్‌సైజ్‌కు సన్నాహకంగా ఈ వర్క్‌షాపును నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సముద్రంలో సునామీ/తుపాన్ సంభవించే కచ్చితమైన సమయం/ప్రాంతాలను గుర్తించి ముందుగానే అక్కడ సముద్ర తీర ప్రాంతాల్లో నివాసముండే జాలరులతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, జిల్లా యంత్రాంగానికి ఏకకాలంలో సమాచారం చేరవేసి అప్రమత్తం చేయడం, ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా కాపాడటంపై ఈ వర్క్‌షాప్‌లో ఆహుతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలకు చెందిన విపత్తు నిర్వహణ సంస్థలతోపాటు ఇన్‌కాయిస్ ప్రతినిధులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు.

పండిత్ దీన్‌దయాళ్ సేవలు మరువలేనివి

దుండిగల్, సెప్టెంబర్ 25 : పండిత్ దీన్‌దయాల్ సేవలు మరువలేనివని మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ కన్వీనర్ డా.ఎస్.మల్లారెడ్డి అన్నారు. ప్రగతినగర్ కార్పొరేషన్ పరిధి, ప్రగతినగర్‌లో పార్లమెంటరీ స్థానం కోకన్వీనర్ డా.ఎంఆర్ఎస్ రాజు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా జిల్లా కన్వీనర్ ఎస్.మల్లారెడ్డి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జేకే.శేఖర్ యాదవ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి విఘ్నేష్‌లు, నేతలు భిక్షపతి యాదవ్, నరేంద్ర చౌదరి, ప్రసాద్ రాజు, నాగరాజు, సుమన్‌రావు, శిల్పారెడ్డి, భార్గవి, శివానంద తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, బౌరంపేట్‌లోని సింహపురికాలనీలో జరిగిన పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకల్లోనూ మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక నేతలతో కలిసి పార్కులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు కృష్ణారెడ్డి, ప్రమోద్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి, సీతారాంరెడ్డి, సత్తిరెడ్డి, రాజేశ్వర్, విజయ్‌కృష్ణమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రగతినగర్‌లో జరిగిన పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిలో పాల్గొన్న మల్లారెడ్డి తదితరులు

ముగిసిన ఖోఖో ఛాంపియన్‌షిప్ పోటీలు

విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న నిర్వాహకులు

దుండిగల్, సెప్టెంబర్ 25: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, బాచుపల్లిలోని వల్లూరుపల్లి రత్తయ్య సీతమ్మ(వీఆర్ఎస్) విజ్ఞాన జ్యోతి పాఠశాల ప్రాంగణంలో గత నాలుగురోజులుగా జరుగుతున్న సీబీఎస్ఈ పాఠశాలల ఖోఖో ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్ బుధవారంతో ముగిసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని సుమారు 200 పాఠశాలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ముగింపు వేడుకలు ఈ వీఆర్ఎస్ విజ్ఞానజ్యోతి పాఠశాల మేనేజ్‌మెంట్ తరపున ట్రస్టీ వల్లూరుపల్లి రమణశ్రీ, పాఠశాల డైరెక్టర్ కొడాలి విజయరాణి, సాయి జీరావు, వీఎన్ఆర్ కళాశాల ప్రతినిధులు శ్రీరాం, ఖోఖో అసోసియేషన్ సభ్యులు అతిథులుగా హాజరయ్యారు. అనంతరం వివిధ విభాగాల్లో విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులను అందజేశారు.

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల పట్టాల సాధనకు కృషి

రాష్ట్ర కోశాధికారి మోతె వెంకట్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజును శాలువాలతో సత్కరిస్తున్న జిల్లా కమిటీ ప్రతినిధులు

కాప్రా, సెప్టెంబర్ 25: అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్లపట్టాలు ఇప్పించడానికి టీయూడబ్ల్యూజే (ఐజేయూ) కృషిచేస్తుం దని, అందుకోసం జర్నలిస్టులు దరఖాస్తు చేసుకోవాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కోశాధికారి మోతె వెంకట్‌రెడ్డి సూచించారు. బుధవారం మల్లాపూర్‌లోని ఎస్ఎల్ఎన్ ఫంక్షన్‌హాల్‌లో యూనియన్ నియోజకవర్గం అధ్యక్షుడు పల్లా మహేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఉప్పల్ నియోజకవర్గం జర్నలిస్టుల సమావేశానికి వెంకట్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలోని జర్నలిస్టులకు ఇండ్లపట్టాలు ఇవ్వడానికి రాష్ట్రప్రభుత్వం సానుకూలంగా ఉందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇండ్లస్థలాలు లభించేలా కృషిచేస్తామని అన్నారు. జర్నలిస్టుల సమస్యలు చర్చించడానికి త్వరలో సీఎంతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజుగౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకట్రామ్‌రెడ్డి, జిల్లాకమిటీ ప్రతినిధులు కేసీ మోహన్, పంజాల శ్రీనివాస్, ఆదిమూలం శ్రీనివాస్, అక్బర్,చంద్రమౌళి, విజయ్, శ్రీధర్, కాప్రా ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు అశోక్, ప్రధాన కార్యదర్శి బాలరాజు, ఉప్పల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి నరోత్తంరెడ్డి, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ ఇంకెప్పుడు?

- రైతు సహకార సంఘం సమావేశంలో రైతులు నిలదీత
- ఆందోళన చేసిన బీజేపీ నేతలు, రైతులు

ఘట్‌కేసర్,సెప్టెంబర్25: ఘట్‌కేసర్ రైతు సహకార సొసైటీ సమావేశం స్థానిక నారాయణ గార్డెన్‌లో చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగింది.ఈ సమావేశంలో రుణమాఫీ ఇంకెప్పుడు చేస్తారని రైతులు,రైతు నాయకులు అధికారులను నిలదీశారు. అనంతరం వారు ఆందోళన చేపట్టారు. ఈ సమావేశంలో మేనేజర్ రత్న జయప్రకాశ్ చదివి వినిపించిన సొసైటీ నివేదిక అనంతరం రైతులు మాట్లాడుతూ, ప్రభుత్వం చెప్పిన ప్రకారంగా రైతులందరికీ రుణమాఫీ కాలేదని బీజేపీ నాయకులతో కలిసి రైతులు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ రాంరెడ్డి వివరణ ఇచ్చే విషయంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నాయి. రైతులు నాయకులను నిలదీస్తూ వేదిక ముందుకు రావడంతో పోలీసులు నిలువరించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులకు,సొసైటీ చైర్మన్‌కు వాగ్వాదం జరిగింది.

ఘట్‌కేసర్ రైతు సహకార సొసైటీ సమావేశంలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

ప్రొటోకాల్‌ను పాటించడంలేదు

సమావేశానికి హాజరైన కాంగ్రెస్ ఇన్‌చార్జి జంగయ్య యాదవ్‌ను వేదికపై ఆహ్వానించగా బీజేపీ నాయకులు అభ్యంతరం తెలిపారు. అధికార పార్టీ నాయకులను వేదికపై ఎందుకుపిలుస్తున్నారని నిలదీశారు. దీంతో జంగయ్య యాదవ్ వేదికపైకి వెళ్లకుండా రైతుల వద్ద కూర్చోవడంతో సమావేశం కొనసాగింది.

అర్హులందరికీ రుణమాఫీ చేస్తుంది

సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి,నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి జంగయ్య యాదవ్ మాట్లాడుతూ అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం త్వరలో రుణమాఫీ చేస్తుందని అన్నారు. ఘట్‌కేసర్ రైతు సొసైటీలో ఇప్పటికే 1230 మంది రైతులకు దాదాపు రూ.7కోట్లకు పైగా ప్రభుత్వం నుంచి విడుదలైన నిధులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. సొసైటీ సభ్యులైన మరో 20 మంది రైతులు ఎన్ఆర్ఐలు కావడంతో మాఫీ ఆలస్యం అవతుందని వివరణ ఇచ్చారు. త్వరలో ఇక్కడి రైతులందరికి రుణమాఫీ డబ్బులు ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు.సమావేశంలో మాజీ జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, జిల్లా సహకార సంఘాల అధికారి వెంకట్‌రెడ్డి,ఘట్‌కేసర్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పావని,డైరెక్టర్లు,రైతులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి

సీఎం సహాయనిధి మంజూరు పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్, సెప్టెంబర్ 25: నిరుపేదలకు సీఎం సహాయనిధి వరంగా తోడ్పతున్నదని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఈ పథకం సాయంతో కార్పొరేట్‌లో ఉచితంగా వైద్య సేవలను పొందుతున్నారన్నారు. మాదాపూర్, వివేకానందనగర్ డివిజన్‌లకు చెందిన సయ్యద్ హుస్సేన్, లక్ష్మిలకు అత్యవసర వైద్య సేవల నిమిత్తం సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.2,75,000 నిధుల పత్రాలను పీఏసీ చైర్మన్ గాంధీ బుధవారం తన నివాసంలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. సీఎం సహాయనిధి నిరంతర సేవలతో పేద ప్రజల ఆరోగ్యానికి కొండంత భరోసాను అందిస్తున్నదన్నారు. ఈ పథకం సాయంతో నిరుపేదలు ఎందరో తమ అనారోగ్యాలను నయం చేసుకుని కుటుంబ పోషణతో ముందుకు సాగుతున్నట్లు గాంధీ తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

కొండాపూర్‌లోని 8వ పోలీసు బెటాలియన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సబ్సిడీ పోలీసు క్యాంటిన్ (ఎస్‌పీసీ)ని బుధవారం తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీసు విభాగం అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు సంజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై టీజీఎస్‌పీ డీఐజీ ఎంఎస్ సిద్ధిఖీ, బెటాలియన్ కమాండెంట్ సీ.సన్నీలతో కలిసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. *- కొండాపూర్, సెప్టెంబర్ 25*

అస్సాం స్టడీ టూర్‌లో కార్పొరేటర్లు

జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు స్టడీ టూర్లలో భాగంగా అస్సాం రాష్ట్రం వెళ్లిన విషయం తెలిసిందే. బుధవారం అస్సాంలోని గౌహటి పట్టణంలో స్థానిక మున్సిపల్ సిబ్బందితో చేయిస్తున్న డంపింగ్ యార్డ్‌లను వారు సందర్శించారు. ఇందులో భాగంగానే బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్, మూసాపేట కార్పొరేటర్ మహేందర్ ఆయా డంపింగ్ యార్డులను పరిశీలించారు. *- బాలానగర్, సెప్టెంబర్ 25*

సీతారాం ఏచూరి సేవలు చిరస్మరణీయం

సీతారాం ఏచూరి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

బాలానగర్, సెప్టెంబర్ 25: శ్రీశ్రీనగర్‌లోని సీపీఎం పార్టీ కార్యాలయంలో మహాసభ కార్యక్రమం ఘనంగా జరిగింది. బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీపీఎం పార్టీ జెండాను మండల కార్యదర్శి ఎం.శంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమరవీరులకు నివాళులర్పించారు. నూతన శాఖ కార్యదర్శిగా కృష్ణనాయక్‌ను సభ్యులుగా ఎన్నుకున్నారు. శ్రీను అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. నిరంతరం ప్రజల పక్షాన నిలబడి పోరాడేందుకు సిద్ధమని తీర్మానించారు. సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు సీతారాం ఏచూరి సేవలు చిరస్మరణీయంగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు ధర్మారావు, శివకుమార్, చిరంజీవి, బాలు, బాష తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు టీకాలు

రేబిస్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు అంతర్జాతీయ రేబిస్ డే సందర్భంగా బుధవారం కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో పెంపుడు జంతువులు, వీధి కుక్కలకు ప్రత్యేక వ్యాక్సినేషన్ వేయించారు. బ్లూక్రాస్ సొసైటీ సౌజన్యంతో నిర్వహించిన వ్యాక్సినేషన్‌లో దాదాపుగా 341 పెంపుడు కుక్కలు, వీధి కుక్కలకు టీకాలు వేయించిన్నట్లు కమిషనర్ శ్రీహరి తెలిపారు. ఈ కార్యక్రమంలో 18వ వార్డు కౌన్సిలర్ డప్పు కిరణ్, 12వ వార్డు కౌన్సిలర్ శిరీషప్రవీణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.జానీ, బ్లూ క్రాస్ సంస్థ ప్రతినిధులు, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు. *- కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 25*

పోలీసుల సేవాభావం అభినందనీయం


సమావేశంలో మాట్లాడుతున్న బాలానగర్ డీసీపీ సురేశ్‌కుమార్

జగద్గిరిగుట్ట, సెప్టెంబర్ 25: సేవా కార్యక్రమాల్లో పోలీసులు భాగస్వామ్యం కావడం అభినందనీయమని బాలానగర్ డీసీపీ సురేశ్‌కుమార్ అన్నారు. బాలానగర్ జోన్ పోలీసులు, ఆకార్ఆశా ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం జగద్గిరిగుట్ట పాపిరెడ్డినగర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆసుపత్రి డాక్టర్ భారతేందుశ్వేన్‌తో కలిసి డీసీపీ ప్రారంభించి మాట్లాడారు. పుట్టుకతో అంగవైకల్యం, ప్రమాద, కాలిన గాయాల బాధితులకు శిబిరానికి హాజరయ్యారు. వీరికి ఉచిత శస్త్ర చికిత్సలు చేయిస్తామని తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాధితులను గుర్తించి సమాచారం ఇవ్వడంపై సీఐ క్రాంతికుమార్‌ను ఆయన అభినందించారు. ఆకార్ ఆసుపత్రి యాజమాన్యం సేవాభావంతో రూ.లక్షల ఖరీదైన 9వేల శస్త్రచికిత్సలు ఉచితంగా చేయడం చాలా గొప్పవిషయమన్నారు. శిబిరానికి హాజరైన 40 మంది బాధితులకు వైద్యులు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఏసీపీ హనుమంతరావు, సీఐ క్రాంతి కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.